నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 13 మే 2024 HYDERABAD




ఎగ్జిబిషన్ మైదానంలోని డీఆర్‌సీలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న సీఈవో వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూర్ల బాట పట్టడంతో ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసిన ఎంజీబీఎస్

# పోలింగ్.. ఇయ్యాల్నే

**ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు..**

**మూడు జిల్లాల్లో 140 మంది అభ్యర్థులు**

**ఓటర్లు.. కోటీ పది లక్షలు.. 9,859 పోలింగ్ కేంద్రాలు..**

సిటీబ్యూరో, మే 12, (నమస్తే తెలంగాణ) : ఓట్ల పండగకు గ్రేటర్ సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జరిగే పోలింగ్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు జిల్లాల్లోని నాలుగు ఎంపీ స్థానాలతో పాటు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరుగుతున్నది. మొత్తం 140 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 9,859 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, కోటీ పది లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దాదాపు లక్ష మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా ర్యాంప్‌లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్, సికింద్రాబాద్ వెస్లీ కాలేజ్ లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్‌లో ఏర్పాటు చేసిన డీఆర్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి.. పలు సూచనలు చేశారు.

### ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..

పోలింగ్ వేళ ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..ప్రత్యామ్నాయంగా మరో 12 గుర్తింపు కార్డుల్లో ఏది చూపించైనా.. ఓటు వేసే అవకాశాన్ని సీఈసీ కల్పించింది. ఆధార్ కార్డు, పోస్టాఫీస్, బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ ద్వారా జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, ఫొటోతో కూడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపుపత్రం, దివ్యాంగుల గుర్తింపు కార్డు ఏదైనా.. ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకొని, ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## బాధ్యతగా ఓటు వేయండి

**సీఈవో వికాస్ రాజ్**

ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్‌తో కలిసి ఆయన చార్మినార్, యాకత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఏర్పాట్లను పరిశీలించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఈవో వివరించారు.

## ఏర్పాట్లు పూర్తి

**జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్**

పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. జిల్లాలో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక జరుగుతున్నదని, 3986 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 45 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.



## పోలింగ్ ప్రక్రియ ఇలా..

తొలుత రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎంలను సోమవారం(నేడు) ప్రిసైడింగ్ అధికారి (పీవో) సారథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అమర్చుతారు. అనంతరం ఉదయం 5 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల్లోగా ఈ ప్రక్రియ ముగిస్తారు. ఏజెంట్లు అన్ని పరిశీలించి.. వారు ఒకే అంటేనే ఈవీఎంలను ఓటింగ్‌కు ఉపయోగిస్తారు. ఏవైనా సందేహాలుంటే రిజర్వ్ చేసిన ఈవీఎంలను పరీక్షించి.. ఏజెంట్లు ఒప్పుకుంటే వాటిని ఓటింగ్‌కు వాడతారు. ఓటర్లలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఇలా మూడు రకాల వారుంటారు. ఓటు వేసేందుకు వచ్చినప్పుడు అదనపు ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేక గుర్తులతో మార్కింగ్ చేస్తారు. పోలింగ్ గడువు ముగుస్తుందనే అంశాన్ని 15 నిమిషాల ముందే ప్రిసైడింగ్ అధికారి ప్రకటించాల్సి ఉంటుంది. సాయంత్రం 6 గంటల్లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరూ ఓటు వేయడానికి అర్హులు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకొకసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు వెల్లడిస్తారు.

### ఓటింగ్ శాతం పెరిగేనా..?

ఎన్నికలు ఏవైనా గ్రేటర్‌లో ఉండే ఓటర్లు గడప దాటకపోవడంతో ప్రతిసారీ అత్యల్ప ఓటింగ్ నమోదవుతున్నది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా.. ఇప్పటికే సొంతూళ్లకు సిటీ జనాలు వెళ్లిపోవడంతో ఈసారి ఓటు హక్కును ఎంతమంది వినియోగించుకుంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో 50 శాతంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రేటర్ ఓటర్లు ఎంతమంది ఓటేస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

# మెట్రో నడిపేదెలా?

## ఆదాయానికి గండికొడుతున్న మహాలక్ష్మి

- ప్రశ్నార్థకంగా మెట్రో మనుగడ
- 2026 నాటికి విక్రయించాలని యోచన
- ఐదేండ్ల పాటు 'ఫ్రీ బస్సు' అమలు చేస్తే.. ప్రయాణికుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగదనే అంచనా
- స్టేషన్లలో ఖాళీగా వ్యాపార స్థలాలు

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టు. ఎంతో దూర దృష్టితోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు రూపకల్పన. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని అందుబాటులోకి.. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ముందుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం.. ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చిన ఐదేండ్ల తర్వాత లాభాలు వస్తాయనుకుంటే, అంచనాలను తలకిందులు చేస్తూ నష్టాలను మూటకట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫ్రీ బస్సు ప్రయాణం పేరుతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం..మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉచిత బస్సు పథకాన్ని ఐదేండ్ల పాటు అమలు చేస్తే..మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్యలో పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.

### తారుమారైన అంచనాలు...

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని మూడు మార్గాల్లో రాబట్టుకోవాలని పక్కా ప్రణాళికతో సుమారు రూ.16వేల కోట్లను ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ సంస్థ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. 66 కిలోమీటర్ల పరిధిలో మూడు కారిడార్లలో మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. టికెటింగ్‌తో 50 శాతం, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల ద్వారా 45 శాతం, వ్యాపార ప్రకటనలు ద్వారా ఆదాయం పొందాలని ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ అంచనాలు వేసుకున్నది. ఐదేండ్ల తర్వాత మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరిగి.. ఆ తర్వాత నుంచి లాభాలు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వేసుకున్న అంచనాలు ఇప్పుడు తారుమారయ్యాయి. మెట్రో సేవలు ప్రారంభమై.. ఆరేండ్లు పూర్తయ్యే నాటికి మెట్రో ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా 5 లక్షల నుంచి 5.5 లక్షల దాకా పెరిగింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనాలు తలకిందులయ్యాయి.

### 4.80 లక్షలకు పడిపోయిన ప్రయాణికులు...

హైదరాబాద్ మెట్రో రైలు రైడర్‌షిప్ ఆరేండ్లు పూర్తయ్యే నాటికి దాదాపు 5 లక్షలకు చేరుకుంది. కారిడార్-1( ఎల్బీనగర్-మియాపూర్) మార్గంలో రోజుకు దాదాపు 2.45 లక్షలు, కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో 2.30 లక్షల మంది, కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్) మార్గంలో 35 వేల మంది ప్రయాణం చేస్తున్నారు. గతేడాది నవంబర్ 2023 నాటికి.. హైదరాబాద్ మెట్రో రైలులో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 5 లక్షల నుంచి 5.5 లక్షల మంది గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన డిసెంబర్ 7 తర్వాత నుంచి మహిళలకు అమలు చేసిన ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకంతో మెట్రోలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య సుమారు 4.80 లక్షలకు పడిపోయింది.



### ఆశించిన స్థాయిలో ఆదాయం రాలే...

మెట్రో రైలు ప్రాజెక్టులో రియల్ ఎస్టేట్ అంశం అత్యంత కీలకమైంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలు మెట్రోమాల్స్, మెట్రో స్టేషన్‌లలోని వ్యాపార సంస్థలకు అద్దెకు ఇచ్చే స్థలాలు. ఇతర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూముల ద్వారా 45 శాతం ఆదాయం రావాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 4 మాల్స్‌ను నిర్మించారు. వీటి నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో అన్ని మాల్స్‌ను ఒకేసారి దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం ద్వారా పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చుకునేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైంది.

### 2026 నాటికి..

ఇక మూడు కారిడార్‌లలో నిర్మించిన 59 మెట్రో స్టేషన్లలో వ్యాపార సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు వీలుగా నిర్మించిన స్థలాల్లో సింహ భాగం ఖాళీగానే ఉంది. కేవలం మియాపూర్, ఎల్బీనగర్, రాయదుర్గంలతో పాటు అమీర్‌పేట, ఎంజీబీఎస్, పరేడ్‌గ్రౌండ్-జేబీఎస్ మెట్రో స్టేషన్లలోనే వ్యాపార సంస్థల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మిగతా స్టేషన్లలో 90 శాతం స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. ఇదిలా ఉంటే ఐదేండ్ల పాటు ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేస్తే..మెట్రో ప్రయాణికుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగదనే అంచనాకు వచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ..2026 నాటికి ప్రాజెక్టు మొత్తాన్నే విక్రయించాలన్న ఆలోచన చేస్తోంది. ఇదే విషయాన్ని ఆ సంస్థ ప్రతినిధి ఇటీవల ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.


